

రోడ్డుకు అడ్డంగా వేసిన ఇసుక, మట్టి, పిల్లర్



కల్వర్టు పనులు జరుగుతుండటంతో రహదారికి అడ్డుగా పెట్టిన స్టాపర్లు

- దొండపర్తి శ్రీ సూర్య జంక్షన్‌లో కల్వర్టు నిర్మాణం
- పనులు పూర్తయినా తెరవని మార్గం
- వన్ వే ప్రయాణంతో నిలిచిపోతున్న ట్రాఫిక్
- వాహనచోదకుల అవస్థలు

రెండు నెలలుగా రోడ్డు మూసివేత

అల్లిపురం: దొండపర్తి శ్రీ సూర్య జంక్షన్‌లో రోడ్డు రెండు నెలలుగా మూసివేయడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ కల్వర్టుతో పాటు, రైల్వే న్యూకాలనీకి వెళ్లే రోడ్డులో కాలువ నిర్మాణ పనులు కూడా చేపట్టడంతో వన్ వేలో రాకపోకలు కొనసాగించాల్సి వస్తోంది. ఒకే రోడ్డులో రాకపోకలు సాగుతుండటంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోవటంతో మండుటెండల్లో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, నరసింహనగర్, ఎన్‌జీవోస్ కాలనీ ప్రాంతాలకు చెందిన వాహన చోదకులు అల్లిపురం, జగదాంబ, పూర్ణామార్కెట్‌కు వెళ్లేందుకు ఈ రహదారినే ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో వాహనచోదకులు టీఎస్ఎన్ కాలనీలోని హీరోహోండా షోరూమ్ రోడ్డులో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో చాలా సమయం ట్రాఫిక్‌లో చిక్కుకుని, సమయానికి గమ్యానికి చేరుకోలేకపోతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, రోడ్డును తెరవాలని వాహన చోదకులు, పాదచారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పనులు పూర్తయినా..

కల్వర్టు పనులు పూర్తయి పది రోజులు కావస్తున్నా కల్వర్టుకు అడ్డంగా పెట్టిన స్టాపర్లు తొలగించలేదు. కాల్వ నిర్మాణంలో తవ్వి వదిలేసిన మట్టిని కూడా తొలగించక పోవటంతో ఆ ప్రాంతమంతా చెత్తా చెదారంతో దర్శనమిస్తోంది. సోమవారం నుంచి మృగశిర కార్తెతో పాటు రుతుపవనాలు కూడా ప్రవేశిస్తుండటంతో వర్షాలు కూడా విస్తారంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ **పనులు త్వరితగతిన వ్యర్థాలను తొలగించపోతే తవ్విన మట్టి తిరిగి, కల్వర్టులో చేరి పూడుకుపోయే ప్రమాదం ఉందని పలువురు చెబుతున్నారు. అదే జరిగితే అభివృద్ధి పనులు జరిగినా, తిరిగి పనులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే** పనులు చేపట్టి డెబ్రిస్ తొలగించి, రహదారిని తెరవాలని కోరుతున్నారు.

చుట్టూ తిరిగి వెళ్తున్నాం

నేను అక్కయ్యపాలెం నుంచి పూర్ణామార్కెట్‌కు రోజూ ఇదే మార్గంలో వెళ్లేవాడిని. దాదాపు రెండు నెలలుగా ఈ రహదారి మూసి వేయడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. దీనివల్ల సమయం, పెట్రోల్ వృథా అవుతున్నాయి.

– కరణం శివరామకృష్ణ, వాహన చోదకుడు, అక్కయ్యపాలెం

వన్‌వేలో ప్రయాణం భయంగా ఉంటోంది

దొండపర్తి జంక్షన్‌లో రహదారి మూసేయడంతో వన్‌వేలో ప్రయాణించి చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతోంది. వన్‌వేలో ప్రయాణించడం వలన ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో **అని భయంగా ఉంటుంది.**

– మద్దాల వెంకట అప్పారావు, వాహన చోదకుడు

వ్యాపారాలు లేవు

నెల రోజులకు పైగా దొండపర్తి, అల్లిపురం రోడ్డు మూసివేయడం వల్ల ఈ జంక్షన్‌లో వ్యాపారులకు వ్యాపారాలు ఉండట్లేదు. గత మే నెల సీజన్ అయినప్పటికీ కనీస వ్యాపారం కూడా జరగలేదు. దీంతో ఈ నెల అద్దె కూడా కట్టలేని పరిస్థితి. ఇప్పటికైనా డెబ్రిస్ తొలగించి, రహదారిని త్వరగా తెరవాలని కోరుతున్నాం.

– వి.వెంకటేశ్వరరావు, వ్యాపారి, దొండపర్తి జంక్షన్

ఈతకు వచ్చిన యువకులకు కౌన్సెలింగ్



ఆనకట్ట వద్ద యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీధర్

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో గోస్తని నదిలో ఉన్న ఆనకట్ట వద్దకు ఆదివారం ఈతకు వచ్చిన యువకులకు సీఐ సీహెచ్ శ్రీధర్ కౌన్సెలింగ్ చేశారు. విశాఖపట్నం పెదవాల్తేరు, జ్ఞానాపురం ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి ఈతకు వచ్చారు. మద్యం సేవించి దుర్భాషలాడడంతో స్థానికులు పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ, పోలీసులు ఆనకట్ట వద్దకు వెళ్లి వీరికి కౌన్సెలింగ్ చేశారు. ఆనకట్ట వద్ద ఈతకు దిగడం ప్రమాదకరమని, స్థానికులను దుర్భాషలాడం చట్టరీత్యా నేరమని సీఐ వారికి తెలియజేశారు. ఎనిమిది మందిపై పెట్టీ కేసు నమోదు చేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

అల్లిపురం: మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో గోకుల్ పార్క్ బీచ్‌లో మూడేళ్ల బాలుడు ఒంటరిగా కనిపించాడు. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మహారాణిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ బాలుడి పేరు భోగి పార్థున్ అని, అతని తల్లిదండ్రులు విజయనగరం జిల్లాకు చెందిన పావని, సంతోష్ కుమార్ అని గుర్తించి, వారికి సమాచారం అందించారు. దర్యాప్తు అనంతరం బాలుడిని అతని తల్లిదండ్రులకు అప్పగించారు.

క్లుప్తంగా

ముగిసిన విజయ దుర్గాలమ్మ వార్షిక మహోత్సవాలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న తోట పద్మావతి, కమిటీ సభ్యులు

అల్లిపురం: జెండాచెట్టు వాసుల ఆరాధ్య దైవం శ్రీ విజయ దుర్గాలమ్మ 24వ వార్షిక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మే 22వ తేదీ నుంచి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో సుమారు 200 మందికి అన్న సమారాధన నిర్వహించారు. 34వ వార్డ్ కార్పొరేటర్ తోట పద్మావతి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెను సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కదిరి గురుమూర్తి, లింగం శ్రీనివాసు, ఒక్కళ్ల సత్తిరాజు, ఎల్లయ్యమ్మ, కుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్, శ్రీ రామాంధ్ర యువజన సభ్యులు

అల్లిపురం: లయన్స్ క్లబ్ రామ్‌నగర్ ప్రతినిధులు అల్లిపురం బంగారుమెట్ట శ్రీ రామాంధ్ర యువజన సమాజం సౌజన్యంతో వాహన చోదకులకు, పాదచారులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండడంతో ప్రయాణికుల దాహం తీర్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజం సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

24 నుంచి రాచ పోలమాంబ జాతర



అమ్మవారి సతకం పట్టువద్ద సమావేశమైన ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లిపురం: అల్లిపురం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ రాచపోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలను ఈ నెల 24వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. జాతర ఏర్పాట్లకు సంబంధించి మెయిన్‌రోడ్డులోని అమ్మవారి సతకం పట్టువద్ద ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే అమ్మవారి ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు.

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండపై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నిత్యపూజలు, సుదర్శన హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం వైదిక సదస్యం, మహదాశీర్వచనం(పండిత సత్కారం) నిర్వహించారు. 9న ఉదయం నిత్య పూజలు, సాయంత్రం 6 గంటలకు స్వామి తిరువీధి(రథోత్సవం), విశేష హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. 10న దోపోత్సవం (తిరుమంగైయాళ్వారు కైంకర్యం), 11న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు వేకువ జాము 2 నుంచి 4 గంటల వరకు విశేష పూజలు, 7 గంటల నుంచి స్వామి వారి సామూహిక విశేష వ్రతాలు జరుపనున్నట్లు తెలియజేశారు.

వీఎంఆర్‌డీఏ 'డెక్' భవనం పరిశీలన



డెక్ భవనంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'డెక్' భవన సముదాయాన్ని ఆదివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ భవనానికి సంబంధించిన అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భవనంలో అన్ని మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటన తేదీ ఖరారయ్యే నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో 10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

అల్లిపురం: బహిరంగంగా పేకాట ఆడుతున్న 5గురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.15,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివి.. ఆదివారం డాబాగార్డెన్స్, శారదావీధిలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పేకాడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఫోర్త్ టౌన్ పరిధిలో..

ఫోర్త్ టౌన్ పరిధి సింహగిరి లాడ్జిపై టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో ఫోర్తు టౌన్ క్రైం ఎస్.ఐ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఒక గదిలో పేకాట ఆడుతున్న 5గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.43,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు శ్రీనివాసరావు | కార్యదర్శి సూర్యనారాయణ | కోశాధికారి నూకేశ్వరరావు

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం 49వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని పాతనగరంలోని వాసవీ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–26 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నేతి శ్రీనివాసరావు అధ్యక్షుడిగా, కట్టమూరి సూర్యనారాయణ కార్యదర్శిగా, దుర్గా నూకేశ్వరరావు కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంఘం పూర్వ అధ్యక్షుడు నల్లూరి నూకరాజు తెలిపారు. గుండా శ్రీనివాస్ (వర్తక విభాగం), కొల్లూరు సోమేశ్వరరావు(ఉద్యోగ విభాగం), దుర్గా శాంతి(మహిళా విభాగం)తో పాటు కొత్త అరుణ్‌కుమార్, కల్లూరి సత్తిబాబు, వంకాయల సృజన ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వర్తక విభాగం నుంచి 20 మంది, ఉద్యోగ విభాగం నుంచి 16, మహిళా విభాగం నుంచి ఆరుగురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేఎస్ దుర్గారావు, కోశాధికారి పీవీఎస్ఎన్‌వీ సాంబమూర్తి, కన్యకాపరమేశ్వరి దేవస్థానం సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, వాసవీ కల్యాణమండపం సంఘం అధ్యక్షుడు విన్నకోట రామమూర్తి, పట్నాల వెంకటరెడ్డి, గ్రంధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనేక వ్యాధులకు మూలకారణం ఊబకాయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ నాగేశ్వరరెడ్డి

మహారాణిపేట: ఊబకాయం అంటువ్యాధి కానప్పటికీ, అనేక వ్యాధులకు మూలకారణంగా మారుతోందని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), మెడికవర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఒకరోజు అవగాహన, సీఎంఈ (కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమంలో పలువురు వైద్యులు ప్రసంగించారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, పద్మవిభూషణ్ డాక్టర్ డి. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఊబకాయాన్ని అదుపులో ఉంచకపోతే తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఐఎంఏ విశాఖ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, మెడికవర్ హాస్పిటల్స్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ అధిపతి డాక్టర్ శ్రీనివాస్ నిస్తాల మాట్లాడుతూ, ఊబకాయం తీవ్రమైన చిక్కులు తెస్తుందని, వైద్య సమాజానికి అవగాహన కల్పించే దిశగా ఈ కార్యక్రమం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ ఇసుకపల్లి వాణి, ఐఎంఏ నాయకుడు డాక్టర్ మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 400 మంది వైద్యులు హాజరై మంచి స్పందన లభించింది.

విద్యా హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు

సీతంపేట: విద్యా హక్కు చట్టం–2009ను పటిష్టంగా అమలు చేయాలని రైట్ ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో విద్యా హక్కు చట్టం అమలు తీరుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టం కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు సమైక్యంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధాన ప్రకటన చేయాలని, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లోని నోటీస్ బోర్డుల్లో ఫీజుల వివరాలు ఉండేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. డ్రాప్ అవుట్స్ తగ్గించేలా, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు, సామాజిక వేత్తలు కరుణ, విశ్వనాథం, హుస్సేన్, పి.సి.రావు, సత్యవతి, నరసింహారావు, చాట్ల బాబూరావు రెడ్డి పాల్గొన్నారు.

నేడు నల్ల బ్యాడ్జీలతో ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరసన

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మధ్యాహ్నం 12గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్లు సంయుక్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

36వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం 36వ వార్డులో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డు పరిధి రంగిరీజువీధిలో పర్యటించిన ఆయనకు తాగునీటి సమస్య, డ్రైనేజీ, సమయ పాలన లేని మంచినీటి సరఫరా విషయాలను స్థానికులు తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి, సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

చెన్నారెడ్డి సేవలు ఎనలేనివి

దాబాగార్డెన్స్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు ఎనలేనివని బీజేపీ తెలంగాణ యువ నాయకుడు, మర్రి చెన్నారెడ్డి మనవడు మర్రి పురుషారెడ్డి కొనియాడారు. విశాఖ విచ్చేసిన ఆయన్ని కూటమి నాయకులు, ఉత్తరాంధ్ర కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా ఓ హోటల్‌లో కలిశారు. ఈ సందర్భంగా పురుషారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్, ఉత్తరాంధ్ర మైనార్టీ సంఘం అధ్యక్షుడు సయ్యద్ ముస్తఫా, నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్, బీజేపీ నాయకుడు రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేష్ రాక

మహారాణిపేట: రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం విశాఖ వస్తున్నారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా పార్వతీపురం మన్యంజిల్లాకు వెళతారు. తిరిగి రాత్రి 10 గంటలకు విశాఖలోని ఎన్‌టీఆర్ భవనానికి చేరుకొని రాత్రికి అక్కడ బస చేస్తారు. మంగళవారం ఉదయం 10.45 గంటలకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇంటికి చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తారు.

బీచ్‌లో వ్యక్తి గల్లంతు



బీచ్‌లో గాలింపు చేపడుతున్న పోలీసులు, జిల్లా ఫైర్ సిబ్బంది

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదివారం సాయంత్రం సముద్రంలో గుర్తు తెలియని సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అలల తాకిడికి కొట్టుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనను గమనించిన బీచ్‌లోని స్థానికులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, జిల్లా ఫైర్ సిబ్బంది, జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 10 గంటల వరకు గాలింపు కొనసాగించినప్పటికీ, ఆ వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు.

వైభవంగా బంగారమ్మ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఉత్సవాల్లో సాముగరిడీ



అమ్మవారికి కలశాలతో ఉపారం తీసుకువెళ్తున్న మహిళలు

దాబాగార్డెన్స్: బంగారమ్మ ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. జీవీఎంసీ 29వ వార్డు ప్రకాశరావుపేట, 28వ వార్డు భానోజీనగర్ గ్రామ దేవత అయిన అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 6న ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5 గంటలకు మరిడమ్మకు పూజా కార్యక్రమాలు జరిపారు. కలశాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటలకు గ్రామ పురవీధుల్లో ఉజిడి బండి తిరిగింది.

నేడు తొలేళ్ల సంబరం

అమ్మవారి తొలేళ్ల సంబరాన్ని సోమవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి భానోజీనగర్, ప్రకాశరావుపేట వీధుల్లో పూల ఘటాలు ఊరేగించనున్నారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి మాలధారణ భక్తులు అగ్నిగుండం తొక్కనున్నారు. రాత్రి 7 గంటల నుంచి గ్రామ వీధుల్లో కూటి ఘటాలు తిరగనున్నాయి. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 10న బంగారమ్మ అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 12.30 వరకు ప్రకాశరావుపేట, భానోజీనగర్ తదితర ప్రాంతాల్లో మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, నేల వేషాలు, పులివేషాలు, సేవగరిడీ, అమ్మవారి నృత్యాలతో అమ్మవారి ప్రభతో భారీ ఊరేగింపు పితానిదిబ్బ బంగారమ్మ గుడి వరకు సాగుతుందని తెలియజేశారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష హోమాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు సదాశివరావు

దాబాగార్డెన్స్: సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులోని విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం, సాయంత్రం విశేష హోమాలు, సదస్యం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ అడపా దేముళ్లు పర్యవేక్షణలో కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలు ఈ నెల 12తో ముగుస్తాయని, ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోర్టు వెంకన్న ఆలయంలో గరుడ సేవ

పోర్టు వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం నిత్యపూజలు, సాయంత్రం 6 గంటలకు గరుడ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. సోమవారం ఉదయం 5 గంటలకు నిత్య పూజలు, సాయంత్రం 5 గంటల నుంచి సదస్యం..పండితగోష్టి, మహదాశీర్వచనం నిర్వహించనున్నారు. 10న సాయంత్రం 5 గంటలకు స్వామి వారి తెప్పోత్సవాన్ని సముద్రంపై వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.